ప్రజాశక్తి
శుక్రవారం 18 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



గంజాయి, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గంజాయి వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డివిజి రాజు మాట్లాడుతూ గంజాయితో పట్టుబడితే యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ఎక్సైజ్ సిఐ గణపతి బాబు, అరకు ఎస్ఐ జి దాసు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్‌పి రాజు

'జగనన్న బడుగు వికాసం'లో 49 పరిశ్రమలకు ఆమోదం

జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ తొలి సమావేశంలో నిర్ణయం : కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ తొలి సమావేశం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోకలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులతో పలు అంశాలపై చర్చించిన కలెక్టర్, జగనన్న బడుగు వికాసం కింద 49 పరిశ్రమలకు ఆమోదం తెలిపారు.

ఆమోదించిన 49 పరిశ్రమలలో అత్యధికంగా సర్వీస్ సెక్టార్ నుంచి ఎంపిక చేశారు. ఈ పథకం క్రింద లబ్దిదారులకు 45 శాతం సబ్సిడీ ఉంటుంది. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి నేచురల్ రబ్బర్ ప్రొడక్ట్ క్లస్టర్‌లో 81 పరిశ్రమల కొనసాగింపునకు కమిటీ ఆమోదం తెలిపింది. అదేవిధంగా కాఫీ క్లస్టర్‌లో ది విశాఖపట్నం చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మేక్స్ పరిశ్రమపై సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక అందజేయాలని కమిటీ కోరింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుపై గిరిజనుల్లో అవగాహన కల్పించాలని, వారిని పారిశ్రామికరంగం వైపు ప్రోత్సహించాలని సూచించారు. మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ శ్రీవాణిధర్ రామన్, సహాయ సంచాలకులు నవీన్ కుమార్, పారిశ్రామికాభివృద్ధి అధికారి సూర్య ప్రకాష్, కమిటీ సభ్యులు ఎపిఐఐసి డివిజినల్ జోనల్ మేనేజర్ జయబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నందు, డిఆర్‌డిఎ పీడీ మురళి, ఎల్‌డిఎం కె.రవితేజ, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఐ. కొండలరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీతారామరాజు, అగ్నిమాపకశాఖాధికారి కెపి.నాయుడు, మోటారు ట్రాన్స్‌పోర్టు అధికారి కె. వాసు, లేబర్ ఆఫీసర్ కె.సుజాత పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల రక్షణకు ఉద్యమం

- ★ జిఒ 3 రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి
- ★ అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి
- ★ ఆదివాసీ పథకాలను పునరుద్ధరించాలి
- ★ సిపిఎం జిల్లా ప్లీనరీలో

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం



ప్లీనరీలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి -పాడేరు: ఆదివాసీ హక్కుల రక్షణకు పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం పిలుపునిచ్చారు. గురువారం పిఎంఆర్‌సి కాలనీలోని సిపిఎం కార్యాలయంలో కిల్లో సురేంద్ర అధ్యక్షతన నిర్వహించిన అల్లూరిజిల్లా పాడేరు కమిటీ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ జిఒ 3 రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకపోవడం వల్ల గిరిజన ప్రాంతంలో సుమారు రెండు ప్రభుత్వ ఉద్యోగావకాశాల్లో స్థానిక గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. జిఒ3కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రూల్ రిజర్వేషన్ అమలు చేయడం దారుణమన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాలను పరిరక్షించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, జిఒ 3 రద్దుపై మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. జిఒ3పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే, మరోపక్క అడ్డగోలుగా ఏజెన్సీప్రాంత పోస్టులను మైదాన ప్రాంతాల గిరిజనేతరులతో భర్తీ చేయడం సరికాదన్నారు. దీనివల్ల ఏజెన్సీ గిరిజనులకు తీవ్ర నష్టం చేకూరు తుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న మోడీ, తొమ్మిదేళ్లుగా ఆ హామీని అటకెక్కించి, నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు మరో పక్క కేంద్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయకుండా వివిధ చిన్న తరహా పరిశ్రమలు మూసేసి సుమారు రెండు కోట్ల మంది చిన్న ఉద్యోగాలు, కార్మికులను రోడ్డుపాల్జేసిందన్నారు. అగ్నిపథ్ పేరుతో దేశరక్షణలో కీలకమైన సైన్యం పోస్టుల్లోనూ నాలుగేళ్ల కాలపరిమితితో కాంట్రాక్ట్ నియామకాలు చేపట్టడం దారుణమన్నారు.

నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా అదుపు చేయలేని ప్రభుత్వాలు, కృత్రిమకొరత సృష్టిస్తున్న కార్పొరేట్ కంపెనీలను అదుపు చేయడంలో విఫలమయ్యాయన్నారు. మోడీ పాలనలో వంటగ్యాస్ ధర రూ.450 నుంచి నేడు రూ.1150కి పెరిగిందని, ఉల్లి, టమాట ధరలు సామాన్యులను హడలెత్తిసుంటే, వాటిని నియంత్రించలేని ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులకు రూ.20 లక్షల కోట్ల రాయితీ, రుణమాఫీ కల్పించడం అన్యాయమని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స మాట్లాడుతూ సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ముక్కలు చేసి అదాని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు ఏజెన్సీ ప్రాంతాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసమే రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని ఏకపక్షంగా సవరణలు చేశారన్నారు. స్మార్ట్ మీటర్ పేరుతో విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని అన్నారు.

రుణాల కోసమే కేంద్రం ఒత్తిళ్లకు తలొగ్గి, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం మోడీ సంస్కరణలకు వత్తాసు పలుకుతూ ప్రజలపై భారాలు భారాలు మోపుతోందన్నారు. మణిపూర్‌లో కార్పొరేట్, మతోన్మాద శక్తులు ఎజెండా అమలు చేసి ప్రజలను ఊచకోతకు గురిచేశారని విమర్శించారు. కార్యక్రమంలో అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగ రాజు, బోనంగి చిన్నయ్యపడాల్, ఉమమహేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు



మోతుగూడెంలో నిరసన కార్యక్రమం చేస్తున్న కార్మికులు

చీకటి ఒప్పందం రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి- మోతుగూడెం

విద్యుత్ ఉద్యోగుల పిఆర్‌సి కమిటీలో కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై చేసుకున్న చీకటి ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా, దిగువ సీలేరు డొంకరాయి, మోతుగూడెంలోని ఏపీ జెన్‌కో విద్యుత్ సంస్థ ఉద్యోగులు పోరాట కమిటీ, యుఇఇయు (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ జెఎసి కుదుర్చుకున్న ఒప్పందంలో కార్మికులు ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. 2014 పిఆర్‌సిలో 35శాతం ఇవ్వగా 2018 పిఆర్‌సిలో 2శాతం అదనంగా కలిపి 37శాతం ఇచ్చారని యాజమాన్యం చెబుతుండగా, దానికి కొన్ని కార్మిక సంఘాలు వత్తాసు పలుకుతున్నాయని పేర్కొన్నారు. ఈ విధమైన నిరంకుశ పోకడలను ఎండగట్టాలని, ఈ చీకటి ఒప్పందం రద్దు పరచాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు 45శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, మూడు వెయిట్‌లు ఇవ్వాలని, అలవెన్స్ యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యుఇఇయు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు, రీజనల్ కార్యదర్శి జె.రత్నాకర్, కోశాధికారి బివి.రమణ, డొంకరాయిలో అధ్యక్షులు టి.జగదీశ్వరరావు, కార్యదర్శి జి.రమణబాబు, కార్మికులు పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న ఆదివాసీ గిరిజనులు

లుంగపర్తి వైద్యాధికారి గైర్హాజరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి : హాజరు పట్టికల్లో ముందుగానే సంతకం పెట్టి, విధులకు డుమ్మా కొడుతున్న లుంగపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దివ్యపై జిల్లా కలెక్టర్, డిఎంహెచ్‌ఒకు ఫిర్యాదు చేయనున్నట్లు జెడ్‌పిటిసి దీసరి గంగరాజు వెల్లడించారు.

లుంగపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి దివ్య రెగ్యులర్‌గా విధులకు రావడం లేదని రోగుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు గురువారం పిహెచ్‌సిని సందర్శించారు.జెడ్‌పిటిసి సందర్శన సమయంలోనూ డాక్టర్ దివ్య విధుల్లో లేకపోవడంతో హాజరుపట్టికను పరిశీలించారు. గురువారం కూడావిధులకు వచ్చినట్లు ముందుగానే సంతకం పెట్టి ఉండడాన్ని గుర్తించారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా జూమ్ సమావేశం ఉన్నందున డ్యూటీకి రాలేదని చెప్పారని జెడ్‌పిటిసి గంగరాజు తెలిపారు. మరో వైద్యాధికారి ఉన్నప్పటికీ ఆమె మెడికల్ క్యాంపులకు గ్రామాలకు వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. ఆసుపత్రి శుభ్రత, రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందులు నిల్వలు వంటి అంశాలపై వివరాలను సేకరించారు.

ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, గిరిజనానికి వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం నియమించిన వైద్యులు ఇలా డుమ్మా కొట్టి, వారికి వైద్యం అందుకుండా చేయడం సరికాదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడం సహించరాని నేరమన్నారు. ఈనెల 22న జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇదే అంశంపై ప్రస్తావించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలకు డిమాండ్ చేస్తానన్నారు. ఈలోగా కలెక్టర్, డిఎంహెచ్‌ఒలకు లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తానన్నారు.

అనంతరం పులుసు మామిడి మండల పరిషత్ పాఠశాలను సందర్శించి, పాఠశాల పరిశుభ్రత ఉపాధ్యాయులు పనితీరుపై ఆరా తీశారు. ఐదో తరగతి విద్యార్థులు పాఠ్యపుస్తకాన్ని సరిగ్గా చదవకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు ఉన్నారు

నేడు పివిటిజిల చలో ఐటిడిఎ

జయప్రదానికి గ్రామాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అరకులోయ

సమస్యల పరిష్కారానికి ఈనెల 18న పివిటిజిలు చేపట్టే చలో పాడేరు ఐటిడిఎ ఆందోళనను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి. రామన్న పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మాదల పంచాయతీ పాలమానువలస, సరుబెడ గ్రామాల్లో చలో ఐటిడిఎకు తరలిరావాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ, గడచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని జగన్మోహనరెడ్డి పివిటిజలకు ఒక్కకొత్త పథకం ఇవ్వలేదన్నారు. సరికదా, పివిటిజిలకు ఇచ్చే అంత్యోదయ కార్డులను రద్దు చేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో 2023-25ఏళ్లకు రూ.15 వేల కోట్లు కేటాయించినప్పటికీ, పాడేరు ఐటిడిఎ పరిధిలోని ఆదిమజాతి గ్రామాలకు పైసా చేరలేదన్నారు. పివిజిటిలకు కేటాయించిన సిసిడిపి నిధులతో అంగన్వాడీ, సామాజిక భవనాల నిర్మాణం, రాయితీపై జీవాల యూనిట్లు పంపిణీ, వ్యక్తిగత ట్రైకార్ రుణసాయం, సాగుభూములకు పోడుపట్టాలిచ్చి, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. అధికసంఖ్యలో పివిటిజిలు పాల్గొని, చలో ఐటిడిఎ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు జి.చందు, జె.మధు, రఘునాథ్, శివ, భాస్కరరావు పాల్గొన్నారు.

కొయ్యూరు : పివిటిజి (ఆదిమజాతి తెగలు) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న చేపట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని డౌనూరు పంచాయతీ పరిధి తులబడగెడ్డ, బచ్చింత, నిమ్మలపాలెం, జోడు మామిడి గ్రామాల్లో చలో ఐటిడిఎ కార్యక్రమంపై గురువారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి కార్యక్రమానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తాంబేలు, చిట్టిబాబు, ప్రసాదు, సేంద్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు అప్పలనాయుడు

సిసిడిపి నిధులతో బోట్లు, వలలు ఇవ్వాలి

తాటిపూడి రిజర్వాయర్‌లో మత్స్యకారుల వినూత్న నిరసన



నాటుపడవలెక్కి ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- అనంతగిరి : సిసిడిపి నిధులతో తమకు బోట్లు, వలలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలం చిలకలగెడ్డ పంచాయతీ మెట్టపాలెం, జీలుగులపాడు, విజయనగరం జిల్లా అడ్డతీగల పంచాయతీ కోటపర్తి, దిగువ కోటపర్తి తదితర గ్రామాల గిరిజన మత్స్యకారులు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. తాటిపూడి రిజర్వాయర్‌లో నాటుపడవలు ఎక్కి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పివిటిజి గదబ ఆదివాసీ మత్స్యకారుల్ల సంఘ ప్రతినిధులు శోభమద్దు సన్యాసిరావు మాట్లాడుతూ పాడేరు ఐటిడిఎ ఆవిర్భవించి, 48ఏళ్లు గడుస్తున్నా, మత్యకారుల జీవన స్థితిగతులలకు ఎటువంటి తోడ్పాటు అందించలేదన్నారు. తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణంలో నిర్వాసితులైన మత్స్యకారులు నాలుగు దశాబ్ధాలుగా అదే రిజర్వాయరులో చేపల వేటలో అవస్థలు పడుతూ జీవనం సాగిస్తూ ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదన్నారు. సాంప్రదాయ నాటుపడవల్లోనే ప్రమాదభరితంగా చేవల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిసిడిపి నిధులతో తమకు మరబోట్లుతోపాటు అధునాతన వలలు పంపిణీ చేయాలని కోరారు.ఐటిడిఎ పిఒ తక్షణం స్పందించాలని వేడుకుంటున్నారు.

నిర్మించిన రెండు నెలలకే శిథిలావస్థకు..

గంగవరం రోడ్డు దుస్థితిపై ఫిర్యాదు చేస్తా : సర్పంచ్



పాడైన రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ సీతయ్య

ప్రజాశక్తి -అనంతగిరి : నిర్మించిన రెండు నెలలకే రోడ్డు శిథిలావస్థకే చేరుకోవడంపై కొత్తూరు సర్పంచ్ సారా. సీతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొత్తూరు పంచాయతీ అరకు మెయిన్ రోడ్డు నుంచి గంగవరం వరకు నిర్మించిన బిటి రోడ్డును పరిశీలించారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ,ఎన్ఆర్ఇజిఎస్ శాఖల ఆధ్వర్యంలో రూ.కోటి నిధులతో జులై నెలలోనే రోడ్డు నిర్మాణాన్ని సంబంధిత అధికారులు పూర్తి చేస్తారని, ఇంతలోనే రోడ్డు పాడవ్వడం దారుణమన్నారు. నిర్మాణ సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడం వలన రెండు నెలలకే శిథిలావస్థకు చేరిందన్నారు. దీనిపై సంబంధితశాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానన్నారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గిరిజన హక్కులు ఎత్తివేతకు మోడీ ప్రభుత్వ కుట్ర

- పోలవరం నిర్వాసితుల సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాటాల్లోకి రావాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వెంకటేశ్వర్లు



సమావేశంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వెంకటేశ్వర్లు తదితరులు

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలకు రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలో కల్పించిన హక్కులను ఎత్తేసి, రక్షణ చట్టాలను సవరించి, మైనింగ్ చేసుకొనే విధంగా ఆ ప్రాంతాలను అదానీ, అంబాని వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే మణిపూర్‌లో గిరిజనులపై దాడులు జరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాన్ని మైనింగ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. బిజెపి ఎపి రాష్ట్రానికి, గిరిజనులకు తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. అలాగే మైనార్టీలు, దళితుల మధ్య గొడవలను పెడుతుందని, అటువంటి బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి జనసేన పార్టీలు వత్తాసు పలుకుతున్నాయని పేర్కొన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో స్థానిక ఎమ్మెల్యే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. పోలవరం నిర్వాసితులు లక్షా 6వేల కుటుంబాలకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించలేని స్థితిలో ఈ ఎమ్మెల్యే ఉందన్నారు. బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ ఇక్కడి గిరిజనులకు వైసిపి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందన్నారు.

మరో కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులిస్తేనే పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పడాన్ని తప్పుబట్టారు. కేంద్రం ప్రభుత్వం నిధులు ఇచ్చేవరకు ప్రాజెక్టు నిర్మాణ పనులను ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. టిడిపి అధినేత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుని 72శాతం శాతం పూర్తి చేసినట్లు చెబుతున్నారు తప్పా నిర్వాసితులకు ఎంత శాతం పునరావాసం కల్పించారో చెప్పడం లేదని, నిర్వాసితుల సమస్యలపై కనీసం మాట్లాడటం లేదని విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో పార్లమెంటు సమావేశాల సందర్భంగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ఆహ్వానించినా వైసిపి, టిడిపి నాయకులు రాలేదని తెలిపారు. నిర్వాసితుల సమస్యపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి పార్టీలకు అతీతంగా లక్షా 6వేల మంది నిర్వాసిత కుటుంబాలు పెద్ద ఎత్తున పోరాటాల్లో రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా బి.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, లోతా రామారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సిఐలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పలువురు ఎస్ఐలు సీఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఇందులో భాగంగా రాజవొమ్మంగి పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ గోపి నరేంద్ర ప్రసాద్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజవొమ్మంగి ఎస్ఐగా పని చేస్తూ సిఐగా ఉద్యోగోన్నతి పొందిన గోపి నరేంద్ర ప్రసాద్‌కు మండల పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీస్ సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

విఆర్.పురం : విఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న తెల్లం దుర్గాప్రసాద్‌కు సీఐగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌కు సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మండల కమిటీ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.



సిఐలుగా ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలు నరేంద్ర ప్రసాద్, దుర్గాప్రసాద్

గ్రామస్తుల చేతిలో కింగ్ కోబ్రా హతం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని పందిరి మామిడి గ్రామంలో భారీ కింగ్ కోబ్రాను గ్రామస్తులు హతమార్చారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... బుధవారం రాత్రి సమయంలో పందిరిమామిడి గ్రామంలో భారీ కింగ్ కోబ్రా ఒక ఇంట్లోకి చొరబడి వేరే (జర్రి గోడ్డు) పామును తింటుంది. ఇది చూసిన గ్రామస్తులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. అనంతరం ప్రాణ భయంతో కింగ్ కోబ్రాను హతమార్చారు. దీని పొడవు సుమారు 30 అడుగుల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు.





ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జిసిసి డిపోకు సొంత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:మండలంలోని లైగండ పంచాయతీ ఇసుకగరువు గ్రామంలో జిసిసి డిఆర్ డిపోకు నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం శిథిలావస్థలోనున్న డిపో వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆదివాసీ విభాగం రాష్ట్ర చైర్మన్ పి శాంతకుమారి మాట్లాడుతూ, ఇసుకగరువులోని డిఆర్ డిపో శిథిలావస్థకు చేరుకుని, ఎపుడు కూలిపోతుందోనన్న ప్రమాదకర పరిస్థితిలో ఉందని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డిపోలో రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యం, ఇతర సరుకులు తడిసిపోతున్నా చలనం లేదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, జిసిసి రేషన్‌డిపోకు సొంత భవనం నిర్మించాలని కోరుతున్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిసిసి సభ్యుడు పి చిన్నస్వామి, కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ టి సోమేశ్వరరావు, మండల అధ్యక్షుడు జగన్నాథం, రాజబాబు, పరశురాం, అప్పారావు, రేషన్ లబ్ధిదారులు, గిరిజనులు పాల్గొన్నారు.


పెదబయలులో మొక్కలు నాటుతున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

ఘనంగా ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- పాడేరు : ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పాడేరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ అక్షర హైస్కూల్‌లో నిర్వహించారు. కేకు కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు నేటి సమాజంలో పాత్రికేయుల పాత్ర అనే అంశంపై ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎనిమిది మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆవరణలో డీడీ కొండలరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుళ్ళి సింహాచలంనాయుడు జర్నలిస్ట్ ప్రతినిధులు మొక్కలు నాటారు. విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచి పెట్టారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నవర మోద కొండబాబు, కొంత దుర్గారావు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ బి. నాగరాజు, జిల్లా అక్రిడిటేషన్ సభ్యులు జె. శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. రాజేష్, అక్రిడిటేషన్ కమిటీ మాజీ సభ్యులు కె. ప్రభుదాస్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు, పి. సత్యనారాయణ, యూనియన్ సభ్యులు ఎం. మహేష్, ఎస్. కొండలరావు, శ్రీ అక్షర పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్ పాల్గొన్నారు.

పెదబయలు : ఏపీ యూనియన్ ఫర్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యుజె)ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రెస్‌క్లబ్ భవన ప్రాంగణంలో అధ్యక్షులు కొమ్మ కొండబాబు ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం పెదబయలు వంద పడకల ఆసుపత్రిలో డాక్టర్ చిట్టాపు సింధూరం వడాల్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన వర్తకసంఘం అధ్యక్షుడు పి.భాస్కరరావు, మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు లొట్ల త్రినాధ్ (చిన్ని), వర్తక సంఘం పూర్వ అధ్యక్షులు నల్ల బాబ్జి, సాంబశివరావు ఎపిటిఆర్ఎ మండల అధ్యక్షులు ఎల్.విశ్వనాథం, వైస్ ఎంపిపి కె.రాంబాబు, మాజీ సర్పంచ్ టి త్రినాథ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : అరకు నియోజకవర్గ పరిధిలోని అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ,పెదబయలు, ముంచింగిపుట్టు మండలాలలో ఖాళీగా ఉన్న 18 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హుల నుండి ఈ నెల 25లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి నేరుగా గాని పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేయదలచిన మహిళలు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, స్థానికంగా నివాసముంటున్న వివాహిత మహిళ అర్హులన్నారు. 2023 జూలై ఒకటో తేదీ నాటికి అభ్యర్థులు 21ఏళ్ళ పూర్తయి, 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. 21ఏళ్లలోపు వయస్సున్న అభ్యర్థులు లభించని పక్షంలో 18ఏళ్ళ నిండిన వారి దరఖాస్తులు పరిశీలిస్తామనాను. రిజర్వేషన్ ఆధారంగా కేవలంఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు మాత్రమే వీటికి అర్హులన్నారు. అభ్యర్థుల ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణత 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు, పూర్తి అనాధ, క్రెచ్, హోమ్, ప్రభుత్వ సంస్థలలో నివసిస్తూ, సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగ వ్యక్తులకు ఐదు మార్కులు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులకు లెక్కించి, వచ్చిన మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు చేపడతామన్నారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, వారి అర్హతలను, మార్కులను పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు.

సక్రమంగా ఇంటింటా ఓటర్ల సర్వే

-కోర్టు కేసులపై సకాలంలో స్పందించండి
-జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : హౌస్ టు హౌస్ ఓటర్ల జాబితా సర్వే సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.. గురువారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 18ఏళ్ళు నిండిన యువతను కొత్తగా ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫారం -6లో కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. పూర్తి వివరాలు సరైన ఆధారాలతో ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపునకు ఫారం -7 దరఖాస్తులను వినియోగించాలని, జాబితాలో ఓటరు పేర్లలో మార్పులు చేర్పులకు ఫారం -8 దరఖాస్తులను వినియోగించాలన్నారు. ఇందులో భాగంగా ఒకే ఇంటిలో పది మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా, ఇంటి నెంబర్ లేకుండా ఓటరు జాబితాలో పేర్లున్న వాటిని సమగ్రంగా పరిశీలించి, ధ్రువీకరించాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో మూడు వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యం గల గోడౌనుల నిర్మాణానికి స్థల సేకరణపై తహశీల్దార్లు దృష్టి పెట్టాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌పై సకాలంలో స్పందించాలని, కోర్టు కేసులపై కూడా సకాలంలో స్పందించి త్వరితగతిన కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, క్యాంపు కార్యాలయాలకు సంబంధించిన భూముల అలీనేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్లు, సబ్ కలెక్టర్లను ఆదేశించారు.


జాయింట్ కలెక్టర్ జే. శివశ్రీనివాసు మాట్లాడుతూ, 2000 జనవరి ఒకటి నుంచి నేటి వరకు తొలగించిన ఓటర్ల జాబితాలపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పునః సమీక్ష జరపాలని సూచించారు. తగిన ఆధారాలు జత చేసి మాత్రమే తొలగించాలన్నారు. అటువంటి కేసులు సుమారు 24 వేలు ఉన్నాయని, వాటిని పునః సమీక్షించాలని ఆదేశించారు. జీరో డోర్ నంబర్లతో 13 వేలకు పైగా ఉన్న ఓటర్ల సవరణ జరగాలన్నారు. 18, 19, సంవత్సరాల వయసు గల ఓటర్లు 3 శాతం ఉండాల్సి ఉండగా అది 1.25 శాతం మాత్రమే ఉందని, అందుకే కాలేజీ యువతపై ప్రత్యేక దృష్టి సారించి, వారిని ఓటర్లుగా జాబితాలో చేర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ అంబేద్కర్ పాల్గొన్నారు.

ఎయులో ఆయుర్వేద వైద్య సేవలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రాచీన భారతీయ వైద్య విధానాలలో ఒకటైన ఆయుర్వేదాన్ని ప్రజలకు చేరువ చేసే విధంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం కృషిచేస్తోందని యోగా కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఒఎస్ఆర్‌యు భానుకుమార్ తెలిపారు. గతేడాది డిసెంబర్ 12వ తేదీ నుంచి ఈ సేవలు బీచ్‌రోడ్డులోని ఎయు యోగా విలేజ్‌లో అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. కెజిహెచ్‌లో సుదీర్ఘకాలం సేవలందించిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ ప్రతి గురువారమూ ఉచితంగా రోగులను పరీక్షించి, తగిన చికిత్స, ఔషధాలను సూచిస్తున్నారని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం వంటి వ్యాధులకు చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 32 శాతం మంది ఆర్థరైటిస్, స్పాండిలైటిస్ రోగులకు, 20 శాతం మంది జీర్ణకోశ సంబంధ, 16 శాతం మంది చర్మసంబంధ, 15 శాతంమంది మానసిక సమస్యలతో చికిత్సకు వచ్చినట్లు తెలిపారు. ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్సల సహాయంతో జీవన ప్రమాణాన్ని మెరుగుపరచుకోవచ్చని, ఇప్పటివరకు 90 శాతానికి పైగా రోగులకు చికిత్స అందించి, ఉపశమనం కలిగించినట్లు పేర్కొన్నారు..

జిల్లా పరిషత్ సమావేశం 22కు వాయిదా

ప్రజాశక్తి- పాడేరు: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీ, మంగళవారానికి వాయిదా పడిందని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ముందుగా ప్రకటించినప్పటికీ, అదే రోజున గ్రామ పంచాయతీ ఉపఎన్నికల దృష్ట్యా వాయిదా వేసి, ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి సంబంధిత సభ్యులు హాజరు కావాలని, అధికారులు పూర్తి సమాచారంతో రావాలని జిల్లా పరిషత్ సిఇఒ కోరారు.


అవార్డు స్వీకరిస్తున్న కృష్ణకుమారి

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: తనకు వచ్చే వేతనంలో కొంతమొత్తాన్ని నిరుపేద గిరిజనుల సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్న మానవ హక్కుల నేర నిరోధక సంఘం, ఏజెన్సీ అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారికి స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ సేవా అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తమౌతోంది. కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న తొలిరోజుల్లో గిరిజన గ్రామాలు, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి, గిరిజనులు, విద్యార్థులకు శానిటైజర్లు, మాస్కులు పంపిణీతోపాటు కోవిడ్‌పై అవగాహన కల్పించడం, వయోవృద్ధులకు, పేద మహిళలకు దుప్పటు, చీరలు వంటివి పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన అధికారయంత్రాంగం ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేసింది. పాడేరులో స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్,కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి కృష్ణకుమారి అవార్డు, ప్రశంసాపత్రం స్వీకరించడంపై మండలంలోని గిరిజనులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

ఎయు ఇంజినీరింగ్ కళాశాలతో బిఐఎస్ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, బిఐఎస్ జాయింట్ డైరెక్టర్ వేదుల సాయికృష్ణ సంతకాలు చేశారు. రెండు సంస్థలు సంయుక్తంగా ప్రమాణాలు మెరుగుపరచే అంశాలలో పనిచేస్తారు. సంయుక్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, సింపోజియాలను నిర్వహించడం, రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో కలిసి పనిచేస్తారు. భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసే దిశగా అవగాహన ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నారు. స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు, విద్యా సంబంధ తరగతులను సంయుక్తంగా నిర్వహిస్తారు.

ప్రజా సమస్యలను వివరించేందుకే బస్సు యాత్ర

ప్రజాశక్తి -గాజువాక : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలక వర్గాల దృష్టికి తీసుకెళ్లడమే బస్సు యాత్ర ప్రధాన లక్ష్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా గాజువాక లయన్స్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ప్రారంభమైన బస్సు యాత్ర రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తిరుగుతూ సెప్టెంబర్ 8 తిరుపతిలో ముగుస్తుందని తెలిపారు. బస్సు యాత్ర సందర్భంగా పలు జిల్లాలో ప్రజల సమస్యలపై సదస్సులు, సభలు, సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై శ్రీకాకుళంలో సదస్సు నిర్వహిస్తామని, గిరిజనుల సమస్యలపై పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులలో సభలు నిర్వహిస్తామని తెలిపారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 32 మంది ప్రాణత్యాగంతో ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడుకుంటామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారానికి 868వ రోజుకు చేరాయి. దీక్షల్లో డివైఎఫ్ఐ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ రంగంలోకి వెళితే రిజర్వేషన్లు అమలుకావన్నారు. దీక్షల్లో శ్రావణ్ కుమార్, నితిన్, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి, యుపిఎస్‌సి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిపిఎస్‌సి, యుపిఎస్‌సి ద్వారా నగరంలో నిర్వహించబోతున్న పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షలకు సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19, 21, 22 తేదీలలో నగరంలో నిర్వహించే ఎపిపిఎస్‌సి పోటీ పరీక్షలకు, 19, 20 తేదీలలో జరిగే యుపిఎస్‌సి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎపిపిఎస్‌సి నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షకు 5115 మంది, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్‌కు 530 మంది, శాంపిల్ టేకర్ పరీక్షకు 166 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిప్టులలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం పరీక్షకు ఉదయం 8 గంటల నుంచి 9 గంటలలోపు, అదేవిధంగా మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 2 గంటలలోపు పరీక్షా కేంద్రాల లోపలకు కచ్చితంగా చేరుకోవాలని అన్నారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితిల్లోనూ లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్, స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆదేశించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 19, 20 తేదీలలో యుపిఎస్‌సి నిర్వహించబోతున్న కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రెండు షిఫ్టులలో జరుగుతాయన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 1632 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

పార్కుల్లో ప్రవేశ రుసుము రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : రెసిడెన్షియల్ కాలనీల్లోని పార్కులలో ప్రవేశ రుసుము వసూలు చెయ్యాలని ఇటీవల జివిఎంసి కమిషనర్ చేసిన సూచనను వార్వా, నివాస్ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పార్కుల నిర్వాహక సంఘాల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పార్కుల నిర్వహణకు నిధులను నిర్వాహకులే సమీకరించుకోవాలని, ప్రవేశ రుసుము వసూలు చెయ్యాలని చెప్పడం చాలా అన్యాయమన్నారు.

'గంగవరం'.. రణరంగం

- అదానీ పోర్టు ముట్టడికి వేలాదిగా తరలివచ్చిన కార్మికులు
- తీవ్ర పోలీసు నిర్బంధం, లాఠీఛార్జి
- పలువురికి గాయాలు, సొమ్మసిల్లిపడిపోయిన మహిళలు

ప్రజాశక్తి - గాజువాక

జీతాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్, అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఆధ్వర్యాన గురువారం తలపెట్టిన 'చలో అదానీ గంగవరం పోర్టు' కార్యక్రమానికి వేలాదిగా కార్మికులు కుటుంబాలతో తరలివచ్చారు. పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించినా వెరవకుండా ఇనుప కంచెలను దాటుకుంటూ పోర్టు మెయిన్ గేటు వద్దకు దూసుకెళ్లారు. ఆద్యంతం తీవ్ర ఉద్రిక్తతల నడుమ పోర్టు ముట్టడి కార్యక్రమం సాగింది. పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ క్రమంలో కొందరు కార్మికులకు గాయాలయ్యాయి. మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సాగిన ఈ కార్యక్రమంలో అదానీ పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున కార్మికులు నినాదాలు చేశారు. తమ భూముల్లో పోర్టు కట్టి.. తమపైనే పెత్తనం ఏంటని మండిపడ్డారు. తొలుత పోర్టు కార్మికులు పెదగంట్యాడలోని తమ దీక్షా శిబిరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోర్టుకు మహా ప్రదర్శనగా బయలుదేరారు. పోలీసులు ఆ మార్గంలో మూడు చోట్ల ఇనుప కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అడ్డుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. అవేవీ కార్మికుల పోరును ఆపలేకపోయాయి. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, నాయకులు కొవిరి అప్పలరాజు, వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద కార్మికులకు మద్దతు తెలిపి వారిని ముందుకు నడిపించారు. జీతాలైనా పెంచండి.. మా సముద్రాన్నైనా మాకు ఇచ్చేయండి అని కార్మికులు డిమాండ్ చేశారు. మెయిన్ గేటు వద్ద జరిగిన ధర్నాకు మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య మద్దతు తెలిపి మాట్లాడారు.


ఇనుప కంచె, బారికేడ్లను తోసుకుంటూ దూసుకొస్తున్న కార్మికులు


పోర్టు గేటు వద్ద ధర్నా చేస్తున్న వేలాది మంది కార్మికులు

పోర్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు

పోర్టు గేటు వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. అదానీ గంగవరం పోర్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, లేకపక్షంలో స్టీల్‌ప్లాంట్‌కైనా అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణం కోసం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 1400 ఎకరాలను ఇచ్చారన్నారు. మత్స్యకారులు వారి భూములను, ఇళ్లను, సముద్రాన్ని కోల్పోయారన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 45 రోజులుగా పోర్టు కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి అండతో అదానీ పోర్టు యాజమాన్యం రెచ్చిపోతోందన్నారు. విశాఖ పోర్టులోని కార్మికులకు కనీస వేతనం కింద రూ.36 వేలు అమలు చేస్తుంటే.. గంగవరం పోర్టులో దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులు కన్నెర్రజేస్తే అదానీ తట్టాబుట్టా సర్దుకుని గుజరాత్ పోవాల్సిందేనని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇచ్చిన గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. వైసిపి గాజువాక నియోజవర్గం ఇన్‌ఛార్జి తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడుతూ గంగవరం మత్స్యకారులు, కార్మికులు సహనంతో ఇంతవరకూ ఉన్నారని, లేకుంటే పరిస్థితి వేరేలా ఉండేదని చెప్పారు. జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద్ రెడ్డి మాట్లాడుతూ అదానీ యాజమాన్యం మొండివైఖరి వీడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ జెఎసి ఒప్పందంతో కార్మికులకు అన్యాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల ఆశలపై నీళ్ళు చల్లుతూ పవర్ జెఎసి యాజమాన్యంతో యాజమాన్యం చేసుకున్న చీకటి ఒప్పందాన్ని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. గురువారం ఎలక్ట్రికల్ ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం ఉద్యోగ, కార్మిక వర్గానికి ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాదని, ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని, దళారీ వ్యవస్థను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అనంతర కాలంలో విస్మరించారన్నారు. కార్మికులకు జరిగిన అన్యాయంపై భవిష్యత్తులో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యారావు, జిల్లా చైర్మన్ వేపాడ సత్యనారాయణ పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

మణిపూర్ అకృత్యాలపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మణిపూర్‌లో మారణ హోమానికి ఆర్ఎస్ఎస్, బిజెపినే కారణమని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. గురువారం సాయంత్రం రాంనగర్ బజార్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలను ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, ముఠా కార్మిక సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రి బాబు, డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు దుర్గారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు హెల్త్ సెక్రటరీల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల (ఎఎన్ఎంలు, గ్రేడ్ 3) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్టు యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిహెచ్.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్ కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్, నర్సింగ్, పారామెడికల్, సహాయక సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాఖలో చల్లని గాలులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వరుస ఎండలు, ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు గురువారం సాయంత్రం నగరంలో వీచిన గాలులు, ఏర్పడిన చల్లదనంతో కాస్త ఉపశమనం లభించింది. వాస్తవానికి గురువారం కూడా ఎండలు 36 డిగ్రీలుగా రాష్ట్రంలోని పలు కేంద్రాల్లో నమోదయ్యాయి. నెల్లూరు, కావలిలో 37 డిగ్రీలను ఉష్ణోగ్రతలు తాకాయి. ఆగస్టు నెల సాధారణంగా రుతుపవనాల కాలం. విస్తారంగా వర్షాలు కురిసే సమయం. కానీ ఎండలు మండిపోతుండడంతో ప్రజానీకం తీవ్ర అసౌకర్యానికి గురౌతూ వస్తున్నారు. ఈ నెల 16న ఈశాన్య బంగాళాఖాతం, సరిహద్దు తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం గురువారం నాటికి వాయువ్య పరిసర ప్రాంతాల్లోకి విస్తరించిన కారణంగా రాగల 12 గంటల్లో అంటే గురువారం రాత్రి 12 గంటల నాటికి అల్పపీడనంగా ఇది బలపడనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కొద్దిచోట్ల రాగల రెండు రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని అమరావతి వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు పలుచోట్ల తేలికపాటి వర్షాలూ కురవనున్నాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో గురువారం సాయంత్రం కాస్త ఊరటనిచ్చేలాగ చల్లని గాలులు విశాఖలో వీచాయి.

స్టేడియాలను జివిఎంసియే నిర్వహించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో ఉన్న స్వర్ణభారతి స్టేడియం, ఇతర ప్రాంతాల్లో ఉన్న స్టేడియాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే నిలుపుదల చేయాలని, స్టేడియాలన్నింటినీ జివిఎంసియే నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఎంవిపిలో ఉన్న స్పోర్ట్స్ ఎరీనా స్టేడియాన్ని రూ.27 కోట్ల ప్రజాధనంతో నిర్మించి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడంపై తమ పార్టీ పలుమార్లు నిరసనలు చేపట్టిందన్నారు